

అధికారమూ పెత్తనమూ చలాయించాలనే భావం ఎక్కడి నుండి పుట్టుకొస్తున్నదో కనిపెట్టామంటే, హింస, దౌర్జన్యం మనలో ఎందుకున్నాయో అనే ప్రశ్నకు అక్కడే సమాధానం లభించవచ్చు.


# అంతరంగ యాత్ర

జె. కృష్ణమూర్తి బోధనలతో కెఎఫ్ఐ ప్రచురణ

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA  APRIL 2011 - JULY 2011  Rs.2/- VOL.V ISSUE 3


# కలలు

## (పగటి వేళలో సమస్త జీవన ప్రవాహపు కదలికల ఎడల స్పృహగా ఉన్నట్లయితే కలల అవసరం ఉంటుందా?)

ఒకరి ప్రశ్న: మనోవైజ్ఞానిక నిపుణులు ఏమంటారంటే పగటిపూట జరిగే ఆలోచనా ప్రక్రియ, ఇతర కార్యకలాపాలూ ఎంత ముఖ్యమో కలలు కనడం కూడా అంతటి ప్రాముఖ్యత కలదే అని. కలలు కనడం కనుక జరగకపోతే నా నిత్యజీవితంలో పెను ఒత్తిడికి, అలసటకు లోనవుతానని కూడా వారు నాతో అన్నారు. ఒక విషయం చాలా గట్టిగా నొక్కి చెప్పారు – అది నా మాటల్లో చెప్తున్నాను. నిద్ర పోతున్నప్పుడు కొన్ని సమయాల్లో కనురెప్పలు కదలుతుంటాయట. అవి కొత్త కొత్త స్వప్నాలను కనడం సూచిస్తాయట. ఈ రకరకాల స్వప్నాలు రావడం మెదడును శుభ్రపరచి ఒక రకమైన స్వచ్ఛతను తీసుకొస్తుందట. అయితే నేను అనుకుంటున్నదేమిటంటే, మీరు తరుచు చెప్తుంటారే ఆ మనసు నిశ్చలత్వం వలన దైనిక జీవితంలో సామరస్యమూ సమశ్రుతీ నెలకొంటాయే తప్ప ఈ రకరకాల కలలు కనడం ద్వారా అంతగా సమతుల్యత ఏర్పడదేమో అని. ఇంకొ సంగతి కూడా నేను అడగాలనుకుంటున్నాను. కలలు ఎప్పుడూ ఏవో సంకేతాల ద్వారా మాట్లాడుతాయి ఎందుకని?

**కృష్ణమూర్తి:** భాషే ఒక సంకేతం కాదా? పైగా ఈ సంకేతాలకు మనం అలవాటు పడిపోయాం. ఒక చెట్టును మనం చూస్తున్నప్పుడు చెట్టు గురించిన మనకు గల ఒక ప్రతిరూపం ద్వారా ఆ చెట్టును చూస్తుంటాం. మన పొరుగున వున్న ఒక మనిషిని కూడా మన లోపల వున్న మనోచిత్రంలో నుండి చూస్తాం. దేనినైనా సరే, ఏ మనోబింబాలు లేకుండా, ఏ అభిప్రాయాలు, ముందే చేసుకున్న నిర్ధారణలు లేకుండా సూటిగా చూడటం మనిషికి మహా కష్ట సాధ్యమైనదిగా కనబడుతున్నది. ఇవన్నీ కూడా – మనోబింబాలు, అభిప్రాయాలు, నిర్ధారణలు – అన్నీ సంకేతాలే.

అందుచేత, కలల్లో సంకేతాలు చాలా పెద్ద పాత్ర వహిస్తుంటాయి. ఇందులో పెద్ద ప్రమాదం ఉన్నది. ఇందులో వంచన కూడా ఉన్నది. స్వప్నానికి గల అర్థం ఏమిటో మనకి అంత స్పష్టంగా

☞ 2

# మనసు, 'నేను' ఒకటే. వేరు వేరు కావు

ఒకరిప్రశ్న: మనసుకు, స్వీయానికి (నేనుకు) మధ్య ద్వైతభావం ఉన్నదా? అలా లేనట్లయితే మనసును స్వీయం నుండి తప్పించడం ఎట్లా?

**కృష్ణమూర్తి:** 'నేను'కు – స్వీయానికి – అహానికి, మనసుకు మధ్యన ద్వైతభావం ఉన్నదా? ఏ మాత్రం లేదు. మనసే స్వీయం. అదే అహం. అహం – స్వీయం అంటే ఈర్ష్య, దౌర్జన్యం, హింసా అనేటటువంటి ప్రేరణా, ఒత్తిడీ. ఈ ప్రేమరాహిత్యము, పరువుప్రతిష్ఠల కోసం, అధికారం కోసం, పడే అంతులేని ఆ ఆరాటమూ, ఏదో అవాలనే ప్రయత్నమూ – అదంతా కూడా. మనసు చేసే పని కూడా ఎప్పుడూ ఇదే. అవునా కాదా? మనసు ఎప్పుడూ తనను తాను ఎలా అభివృద్ధి చేసుకోవాలి, ఇంకా సురక్షితంగా ఉండటం ఎలా, ఇంత కంటె మంచి హోదా, ఇంతకంటె ఎక్కువ సౌఖ్యం, బోలెడు ఐశ్వర్యం, పదింతల అధికారం ఎలా పొందాలి అని ఆలోచిస్తూ వుంటుంది. ఇదంతా కూడా నేను – స్వీయం. అందుచేత మనసే నేను. నేను అనేది విడిగా ఎక్కడో లేదు. కాని మనకు అలా విడిగా ఉన్నది అని అనుకోవడమే ఇష్టం. ఎందుకంటే అప్పుడు నేనును మనసు అదుపులో పెట్టచ్చు అనీ, పట్టూ విడుపూ అంటూ ఆటలాడుకోవచ్చు అనీ, అణచి స్వాధీనంలో ఉంచుకోవడం, స్వీయం గురించి ఏదో ఒకటి చేయడమూ వంటివి చేయచ్చు అనీ. ఇవన్నీ కూడా చదువుకున్న మనసు ఆడే పరిణతి లేని ఆటలు. ఇక్కడ చదువు అంటే ఆ మాటకి గల నిజమైన అర్థంలో అనడం లేదు.

సరే, ఈ మనసే నేను. అన్నీ స్వంతం చేసుకోవాలనే ఆ నిర్మాణ స్వరూపం అంతా అదే. ఇప్పుడు సమస్య ఏమిటంటే: మనసు తన నుండి తనను విడిపించుకోవడం ఎలా? దయచేసి శ్రద్ధగా వినండి. తనను తాను విడిపించుకోవాలని చేసే కదలిక ఏదైనా కూడా అదంతా నేను చేస్తున్నదే కదా. అవునా కాదా?

చూడండి, నేనూ నా మనసూ ఒకటే. నాకు, నా మనసుకు మధ్య విభజన లేనే లేదు. ఈర్ష్య పడుతూ, ఆకాంక్షిస్తూ ఉన్న స్వీయం – 'నేను' ఈర్ష్య పడకూడదు, ఉత్తమోత్తముడిగా

☞ 4

*(1వ పేజీ తరువాయి) . . .*

## కలలు

తెలియదు. కల అంతా ఏవో సంకేతాల ద్వారా సూచిత మవుతున్నదని గ్రహించి, వాటి వెనుక వున్న అర్థాన్ని విప్పి చూడాలని ప్రయత్నిస్తుంటాం. ఏదైనా ఒకటి చూడగానే దానిని గురించి మాట్లాడేస్తూ ఉంటామే తప్ప, మనం మాట్లాడే ఈ మాటలు కూడా సంకేతాలే అనే గుర్తింపు మనలో ఉండదు. ఇదంతా ఒకటి సూచిస్తుంది. ఏమిటంటే, శాస్త్ర, వైజ్ఞానిక విషయాల్లో అయితే సరియైన భావప్రసారం జరుగుతుంది. తప్ప, మానవుల పరస్పర సంబంధాల్లో, అవగాహనలో అది లోపిస్తున్నది.

ఎవరైనా మిమ్మల్ని కొడితే అప్పుడు మీకు సంకేతాలతో చెప్పవలసిన అవసరం ఉండదు. అది సూటిగా జరిగిన భావప్రసరణ. ఈ విషయం చాలా ఆసక్తి జనకరమైనది. ఏ విషయాన్నైనా సూటిగా చూడటానికి మనసు నిరాకరిస్తుంది. మాట లేకుండా, సంకేతం లేకుండా తన గురించి తాను మనసు తెలుసుకోలేదు. ఆకాశం నీలంగా ఉన్నది అని మీరు అంటారనుకోండి వింటున్నవారు వారి ఎరుకలో నీలం అంటే ఏమిటో దానిని బట్టి ఆ మాటలకు అర్థం చెప్పుకుంటారు. తిరిగి మీకు తమ సంకేత భాషలో పునఃప్రసారం చేస్తారు. అందుచేత మనం సంకేతాల లోనే జీవిస్తుంటాం. ఇక కలలు కూడా ఈ సంకేత ప్రక్రియా విధానంలో ఒక భాగం.

సంకేతాలు లేకుండా, అపోహాలు, ముందుగా చేసుకున్న నిర్ణయాలు, అభిప్రాయాలు లేకుండా సూటిగా, తక్షణమే జరిగే గ్రహింపు–పరిగ్రాహ్యత మనకు చేతకాదు. దీనికి గల కారణం కూడా స్పష్టంగా కనబడుతునే ఉంది. ఇదంతా కూడా స్వీయ – కేంద్రిత కార్యకలాపంలోనిదే. అందుచేత అందులో ఈ స్వీయపు రక్షణ కోసం సమర్థనలు, ప్రతిఘటనలు, పలాయనాలు, భయాలు ఉంటాయి. మెదడులో జరిగే కార్యకలాపాలలో సంకేత రూపంలో జరిగే ప్రతిస్పందన ఉంటుంది. మరి కలలు అప్పుడు సహజంగానే సంకేత చిహ్నాల రూపంలోనే ఉండితీరాలి. ఎందుకంటే సూటిగా జరిగిపోయే ప్రత్యక్ష గ్రాహ్యత, ప్రతిస్పందన మేలుకొని వున్న సమయంలో మనకు చేతకావు కాబట్టి.

**ప్రశ్నిస్తున్నవారు:** అంటే మెదడు స్వతఃసిద్ధంగా ఇట్లాగే పనిచేస్తూ వుంటుంది అని నాకు అనిపిస్తున్నది.

**కృ:** స్వతఃసిద్ధంగా, స్వభావరీత్యా అంటే శాశ్వతమైనది, అని వార్యమైనది, ఎప్పటికీ ఉండేది అని అర్థం. మానసిక స్థితి ఏదైనా సరే దానిని మార్చచ్చు. ప్రాణి యొక్క భౌతిక భద్రత కోసం మెదడుకు గల నిరంతరమైన కాంక్ష మాత్రమే స్వతఃసిద్ధమైనది. మనోతత్వాన్ని రక్షించుకోవడం కోసం మెదడు పన్నిన ఒక ఉపాయం ఈ సంకేతాలు. ఇదంతా ఆలోచనా ప్రక్రియే. 'నేను' ఒక సంకేతం. అది నిజమైన వాస్తవం కాదు. 'నేను' అనే ఈ సంకేతాన్ని సృష్టించుకున్న ఆలోచన ఇక ఆ 'నేను' అభిప్రాయాలతో, ఆ సూత్రంతో మమేకమైపోతుంది. ఆ పైన దానిని సమర్థిస్తుంది. దీనిలో నుండే సమస్తమైన బాధలు, వ్యధలు, దుఃఖం పుట్టుకొస్తున్నాయి.

**ప్ర:** ఇందులో నుండి నేను ఎలా బయట పడగలుగుతాను?

**కృ:** ఎలా బయటపడగలను అని మీరు ప్రశ్నించడమే 'నేను' అనే ప్రతీకను మీరు గట్టిగా పట్టుకొని కూర్చున్నారని తెలుపుతుంది. 'నేను' పూర్తిగా కల్పితమైనది. మీరు చూస్తున్నదాని నుండి మీరు విడిగా, వేరుగా అవుతున్నారు. అందుచేత ద్వైతభావం జనిస్తున్నది.

**ప్ర:** మరొక రోజున వచ్చి మీతో మాట్లాడ వచ్చునా?

◆ ◆ ◆

**ప్ర:** ఇవాళ తిరిగి మీతో మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. ఆ రోజు మనం ఆగిన చోటు నుండి ఆరంభించాలనుకుంటున్నాను.

కలల్లో సంకేతాలను గురించి మనం చర్చిస్తున్నాం. సంకేతాలతోనే మనం జీవిస్తున్నాం. సంకేతాలతోనే మనం జీవిస్తున్నామని, మన మన ఇష్టానుసారం, మనకి తృప్తి కలిగే విధంగా ఈ సంకేతాలను విడ మరచి అర్థాలు చెప్పుకుంటామనీ మీరు విశదపరిచారు. ఇది ఒక్క కలల విషయం లోనే కాదు. మన దైనందిన జీవితంలో కూడా ఇదే రకంగా చేస్తుంటాం. మనకు అలవాటైన తీరు ఇదే. మన మనోబింబాలకు, సంకేతాలకు మనం ఇచ్చుకునే అర్థతాత్పర్యాల మీద ఆధారపడి వుంటాయి మనం చేసే పనులు. ఆ రోజున మీతో మాట్లాడిన తరువాత నా కలల్లో ఒక ప్రత్యేకమైన మార్పు వచ్చింది. ఇది నాకు చాలా వింతగా అనిపిస్తోంది. చాలా అలజడి కలిగించే కలలు వచ్చాయి. ఆ కలలు వస్తూవున్నప్పుడే, ఆ కలల లోనే ఆ కలలకు తాత్పర్యం చెప్పడం కూడా జరిగిపోతున్నది. ఇదంతా ఏకసమయంలో జరిగిపోతున్న ప్రక్రియ. కలలు కంటున్నవాడే కలలకు తాత్పర్యం ఇస్తున్నాడు. ఇది వరకెన్నడూ నాకు ఇట్లా జరగలేదు.

**కృ:** మనం మెలకువగా ఉన్న సమయాల్లో ఎప్పుడూ పరిశీలకుడు ఒకడు ఉంటాడు. ఈ పరిశీలకుడు పరిశీలింపబడుతున్న అంశంతో కలిసి కాకుండా వేరుగా ఉంటాడు. అంటేక్రియ విడిగా వుంటుంది. క్రియ చేస్తున్న కర్త విడిగా వుంటాడు. అదే విధంగా కల కంటున్నవాడు తన కల నుండి విడిగా, వేరుగా వుంటాడు. కల, తను వేరు వేరు అనుకుంటాడు. అందుచేత స్వాప్నికుడు ఆ కలకు తాత్పర్యం చెప్పుకోవడం అవసరం అని అనుకుంటాడు. అయితే స్వప్నము, స్వాప్నికుడు విడివిడిగా వున్నారా? అవి రెండు వేరు వేరా? ఆ కలకు అర్థము, తాత్పర్యము తెలుసుకోవడం అవసరమా? పరిశీలకుడే పరిశీలితము అయినప్పుడు, అప్పుడు అర్థం విడమరచి చెప్పవలసిన అవసరం ఏముంది? మంచీ చెడు అని, విలువ ఎంత అని తూచవలసిన అవసరం ఏముంది? పరిశీలింపబడుతున్న అంశమూ పరిశీలకుడూ వేరువేరు కనుక అయితేనే అప్పుడు ఆ అవసరం వుంటుంది. ఇది అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మనం పరిశీలకుడిని పరిశీలించబడుతున్న వస్తువు నుండి వేరుపరిచాం. దీని వల్ల తాత్పర్యం చెప్పుకోవాలి అనే సమస్య బయలుదేరుతున్నది. అంతేకాకుండా సంఘర్షణ, దానితో పాటుగా అల్లుకొని పోయిన అనేక సమస్యలు వస్తాయి. ఈ విభజన ఒక భ్రమ. మానవ సమూహాలకు, జాతులకు, దేశాలకు మధ్యన గల ఈ విభజన కల్పితమైనది. మనమంతా ప్రాణులం. పేర్లతో కాని, చిట్టీలు అంటించి కాని మనుష్యుల్ని విభజించడం సాధ్యం

☞ 3

## మనం ప్రేమించే వాటిని ఎంత సులువుగా ధ్వంసం చేసుకుంటాం

క్షణాల్లో మన మధ్య అడ్డుగోడ ప్రత్యక్షమవుతుంది. ఒక్క మాట, ఒక్క హావభావం, ఒక్క కదలిక, ఒక్క చిరునవ్వు! ఆరోగ్యమూ, మనోస్థితీ, కోరికా దట్టమైన ఛాయలు పరిచేస్తాయి. ఒకప్పుడు ఉత్సాహమూ, వెలుగూ వెదజల్లినదే ఇప్పుడు కళాకాంతీ కోల్పోయి భారంగా తయారవుతుంది. మనల్ని మనమే అలసటలో పడవేసుకుంటాం. ప్రస్ఫుటంగా తేటతెల్లంగా వుండేది కాస్తా ఇప్పుడు మసకగా, చిక్కులు చిక్కులుగా అయిపోతుంది. ఒకప్పుడు ఎంతో సరళ సుందరంగా విలసిల్లిన బాంధవ్యం నిరంతర ఘర్షణ వలన, ఆశానిరాశల మధ్య ఊగిసలాట వలన ఇప్పుడు భయం భయంగా ఏం లభిస్తుందా అని ఎదురు చూడటంలో పడిపోతుంది."

*(కమెంటరీస్ ఆన్‌లివింగ్-1' నుండి)*

(*2వ పేజీ తరువాయి*) . . .

## కలలు

కాదు. ఈ చిట్టీల పేర్లు చాలా ప్రాముఖ్యత సంతరించుకున్నప్పుడు విభజన జరుగుతుంది. అప్పుడిక యుద్ధాలు, ఇంకా అనేకమైన ఇతర పోరాటాలు పుట్టుకొస్తాయి.

**ప్ర:** అటువంటప్పుడు కలలోని విషయాన్ని నేను అర్థంచేసుకోవడం ఎట్లా? దానికి ఒక వైశిష్ట్యం ఏదో వుండే వుంటుంది. ఒక ఫలానా వారిని గురించి కాని, ఒక సంఘటన గురించి కాని నాకు కల రావడం కేవలం యాదృచ్ఛికమా?

**కృ:** దీనిని మనం మరో భిన్నమైన దృష్టితో చూడవలసిన అవసరం ఉన్నది. అర్థంచేసుకోవలసినది ఏదైనా ఉన్నదా? పరిశీలకుడు తాను పరిశీలిస్తున్న అంశమూ, తాను వేరువేరు అని అనుకుంటున్నప్పుడు, తనకు బయటగా ఉన్న ఆ అంశాన్ని అర్థంచేసుకోవాలనే ప్రయత్నం అప్పుడు ఉంటుంది. అతడి లోపల, అంతర్గతంగా కూడా ఇదే రకమైన ప్రక్రియ జరుగుతుంటుంది. పరిశీలకుడు తను పరిశీలిస్తున్న అంశాన్ని – అంటే అది తనే – అర్థంచేసుకోవాలని కోరుకుంటుంటాడు. అయితే పరిశీలకుడే పరిశీలితము – పరిశీలించబడుతున్న అంశము అయినప్పుడు అర్థంచేసుకోవడమనే ప్రశ్నే ఉండదు. ఉన్నది ఒక్కటే. పరిశీలన మాత్రమే. కలలో అర్థంచేసుకోవలసినది ఏదో ఉన్నది, లేకపోతే అసలు కల ఎందుకు వస్తుంది అని మీరు అంటున్నారు. అపరిష్కృతమైనది ఏదో కల ద్వారా సూచింపబడుతున్నది, అది నేను అర్థంచేసుకోవాలి అని మీరు అంటున్నారు. ''అర్థంచేసుకోవాలి'' అనే మాటను మీరు వాడుతున్నారు. ఆ మాటలోనే ద్వైతభావపు ప్రక్రియ ఉన్నది. 'నేను' అనే ఒకటి ఉన్నది, అర్థంచేసుకోవలసిన విషయం మరొకటి ఉన్నది అని మీరు తలపోస్తున్నారు. కానీ వాస్తవానికి వున్నది ఒక్కటే. ఈ రెండూ వేరువేరు సత్వాలు కావు. అవి రెండూ ఒకటే. అందుచేత కలలో ఏదో అర్థం ఉన్నదని, దాని కోసం మీ వెతుకులాట సంఘర్షణ చేస్తున్న పని.

**ప్ర:** మనసు లోపల ఉన్నదే ఏదో కలరూపంలో అభివ్యక్త మవుతున్నది అని మీరు ఒప్పుకుంటారా?

**కృ:** అది స్పష్టంగా కనబడుతున్నది కదా!

ప్ర: మీరు వివరించిన తీరులో కలలను పరిగణించడం ఎట్లా సాధ్యమో నాకు అర్థంకావడం లేదు. కలలకు ఏ ప్రాముఖ్యతా లేనట్లయితే అవి అప్పుడు ఎందుకుంటాయి?

**కృ:** 'నేను' యే కలలు కంటున్న స్వాప్నికుడు. తను కంటున్న కలలో ఏదో విశిష్టత వున్నదనీ అది కనిపెట్టాలనీ కోరుకుంటున్నాడు. ఆ కల అతడు కల్పించుకున్నదే. అతడు చిత్రించుకున్న పటమే. అందుచేత అతడూ, ఆ కలా రెండూ స్వప్నాలే, రెండూ అవాస్తవాలే. ఈ అవాస్తవం స్వాప్నికునికి, పరిశీలకునికి ఒక నిజంగా తోస్తున్నది. ఎందుకంటే అతడు తను వేరుగా, విడిగా ఉన్నానని అనుకుంటున్నాడు కాబట్టి. క్రియకు క్రియ చేస్తున్న కర్తకు మధ్య ఒక విభజన, ఒక వేర్పాటు ఉన్నదనుకోవడం వలన కలలకు తాత్పర్యం చెప్పుకోవాలనే సమస్య మొత్తం ఉద్భవిస్తున్నది.

**ప్ర:** ఇది నాకు ఇంకా ఇంకా గందరగోళంగా తయారవుతున్నది. అందుచేత దీన్నంతటినీ మరో రకంగా పరికించి చూద్దామా? కల నా మనసు చేసిన ఉత్పాదన అనీ మనసు నుండి అది విడిగా లేదనీ నేను గ్రహించాను. అయితే కలలు ఇంతకు ముందు మనం ఎరగని, చూడని మనసులోపలి పొరలలో నుండి పుట్టుకొస్తున్నట్లుగా కనబడుతున్నది. అందుచేత మనసులోపల సజీవంగా ప్రాణంతో వున్నది ఏదో పంపేసూచనలే ఈ కలలేమో అని అనిపిస్తున్నది.

**కృ:** ప్రత్యేకంగా మీ ఒక్కరి మనసులో ఏవో అంశాలు ప్రచ్ఛన్నంగా దాగి ఉన్నాయని అనుకోకండి. మీ మనసు అంటే మానవుడి మనసు. మీ చేతనావర్తం సమస్త మానవాళిదీ. అయితే మీ మనసు అంటూ దానిని ప్రత్యేకించినప్పుడు మనసు కార్యకలాపాలకు ఒక పరిమితిని ఏర్పరుస్తున్నారు. ఈ పరిమితి కారణంగా కలలు పుట్టుకొస్తున్నాయి. మెలకువగా వున్న వేళల్లో పరిశీలకుడు లేకుండా పరిశీలించండి. ఈ పరిశీలకుడే పరిమితుల వ్యక్తరూపం. ఏ విభజన అయినా సరే అది ఒక పరిమితి అవుతుంది. 'నేను' అనీ 'నేను కానిది' అనీ తనను విభజించుకున్నాక ఈ పరిశీలకునికి, ఈ స్వాప్నికునికి అనేక సమస్యలు వస్తాయి. వాటిలో ఒకటి ఈ కలలూ, కలల తాత్పర్యమూ. ఏరకంగా చూసినా కూడా కలల వైశిష్ట్యం కాని, కలల విలువ కాని కొంత కొంత పరిమితుల వరకే మీరు చూడగలుగుతారు. ఎందుకంటే పరిశీలకుడు ఎప్పుడూ ఒక పరిధికి లోపలగానే ఉంటాడు. స్వాప్నికుడు తన పరిమితిని ఎప్పటికీ అలాగే కొనసాగించుకుంటూ ఉంటాడు. అందుచేత కల ఎప్పటికీ అసంపూర్ణమైన దాని అభివ్యక్తే తప్ప సంపూర్ణత్వాన్ని, అఖండమైన దానిని వెలిబుచ్చలేదు.

**ప్ర:** చంద్రగ్రహం మీద నుండి చిన్నచిన్న ముక్కలు కొన్ని తీసుకొచ్చారు. ఆ చిన్న ముక్కలను చూసి, చంద్రగ్రహం ఏయే పదార్థాలతో తయారైందో అర్థంచేసుకునేందుకు అవి తీసుకొచ్చారు. అదేవిధంగా మన కలలో నుండి కొన్ని ముక్కలను తీసుకొని వచ్చి, అవి వెలిబుచ్చుతున్నదేమిటా అని పరీక్షించి చూసి మానవ మస్తిష్కపు ఆలోచనలను అర్థం చేసుకోవాలని మేము ప్రయత్నం చేస్తున్నాం.

**కృ:** మనసు వెలిబుచ్చే వ్యక్తీకరణం అంతా కూడా మనసు యొక్క చిన్న చిన్న శకలాలు అనమాట. ప్రతిఒక్క శకలము తనకు ఇష్టమైన రీతిలో తనను తాను వ్యక్తం చేసుకుంటుంది. అది, ఇతర శకలాలు పరస్పరం ఖండించుకుంటాయి కూడా. ఒక కల మరొక కలకు విరుద్ధంగా ఉండవచ్చు. ఒక క్రియకు మరొక క్రియకు, ఒక కోరికకు మరొక కోరికకు మధ్య పరస్పర వైరుధ్యం ఉండచ్చు. ఈ విధమైన గందరగోళంతో మనసు జీవిస్తుంటుంది. మనసులోని ఒక భాగం మరొక భాగాన్ని అర్థం చేసుకొని తీరాలి అని అంటుంది. అంటే ఒక స్వప్నాన్నో,

## ఆ అపూర్వమైన స్థితిని అనుభూతి చెందండి

**మరణం అంటే ఏమిటి? మీకు తెలిసినవి అన్నీ పూర్తిగా ముగిసిపోవడం. మీకు తెలిసినవి అన్నీ కనుక అంతమై పోకపోతే అప్పుడది మరణం అవదు. మరణం ఏమిటో మీకు తెలుస్తే అప్పుడిక మీరు భయపడవలసినది ఏమీ ఉండదు. అయితే మరణం అంటే ఏమిటో మీకు తెలుసా?**

**అంటే, ఈ అశాశ్వతమైన దానిలో తెగిపోకుండా కొనసాగేది ఏదైనా ఉన్నదేమో కనిపెడదామనే మీ అంతులేని ప్రయత్నప్రయాసలను మీరు బ్రతికి ఉండగానే ఆపివేయగలరా? మనం మరణం అని అంటున్న ఆ అజ్ఞేయాన్ని ప్రాణం ఉన్నప్పుడే తెలుసుకోగలగడం సాధ్యమా? మరణం తరువాత జరిగే వాటిని గురించి పుస్తకాల్లో మీరు చదివిన వర్ణనలు, మీ లోపల ప్రచ్ఛన్నంగా వున్న సుఖకాంక్ష ఇలాగే ఉంటుంది అని చిత్రించుకున్న వర్ణనలు - మొత్తంగా వీటన్నింటిని త్రోసిపారేయగలరా? అలా చేసి ఆ స్థితిని, ఆ అపూర్వమైన స్థితిని ఇప్పుడు రుచి చూడగలరా, అనుభూతి చెందగలరా? ఆ స్థితిని కనుక ఇప్పుడు మీరు అనుభూతి చెందగలుగుతే ఇక అప్పుడు బ్రతికివుండటం, మరణించడం రెండూ ఒక్కటై పోతాయి.**

***('యాజ్ వన్ ఈజ్' నుండి; 6వ ప్రసంగంలోనిది)***

*(3వ పేజీ తరువాయి) . . .*

## కలలు

ఒక క్రియనో, ఒక కోరికనో. కాబట్టి ప్రతి ఒక శకలానికి స్వంతంగా ఒక్కో పరిశీలకుడు ఉంటాడు. దాని స్వంత కార్యకలాపాలు ఉంటాయి. పైగా ఒక ఉన్నత పరిశీలకుడు వచ్చి, వీటన్నింటిని కలిపి సామరస్యంలో పెట్టాలను కుంటాడు. ఈ ఉన్నత పరిశీలకుడు కూడా మనసులోని ఒక శకలమే. ఈ పరస్పర వైరుధ్యాలు, ఈ విభజనలు కలలను పెంచి పోషిస్తాయి.

అందుచేత అసలు ప్రశ్న ఏమిటంటే ఏదో ఒక కలను అర్థంచేసుకోవడం కాదు. దానికి తాత్పర్యం చెప్పడం కాదు. ఇలా అనేకమైన శకలాలు అఖండసంపూర్ణత్వంలో ఉన్నాయి అనే గ్రహింపు కలగడం. అప్పుడు మిమ్మల్ని మీరు ఒక సంపూర్ణ సమస్తంగా చూసుకుంటారు తప్ప, ఆ సంపూర్ణంలోని ఒక శకలంగా కాదు.

**ప్ర:** సర్, మీరు అంటున్నది ఏమిటంటే – పగటి వేళలో కేవలం మన కుటుంబజీవితం గురించే కాకుండా, లేదా మన వ్యాపారము మొదలైన తక్కిన వ్యక్తిగత వ్యవహారాల గురించే కాకుండా సమస్తమైన జీవన ప్రవాహపు కదలిక ఎడల మనం ఎరుకతో ఉండాలీ అనేనా?

**కృ:** చేతన అంటే అది సమస్త మానవులదీ. అంతేకాని అది ఏ ఒక్క మనిషికి చెందినదీ కాదు. ఒక మనిషి చేతన అని ప్రత్యేకించినప్పుడు ముక్కలు ముక్కలుగా విచ్ఛిన్నత, పరస్పర వైరుధ్యం, యుద్ధాలు మొదలైన సంక్లిష్ట సమస్యలు పుట్టుకొస్తాయి. ఒక మనిషిలో కనుక మేలుకొని ఉన్న సమయంలో సమస్త జీవన ప్రవాహపు కదలిక గురించి ఎరుక, స్పృహ ఉన్నట్లయితే, అప్పుడిక కలల అవసరం అసలు ఉంటుందా?

ఈ సంపూర్ణమైన ఎరుక, ఈ సావధానత శకలాలుగా విచ్ఛిన్నం చెందడాన్ని, విభజనను ఆపివేస్తుంది. సంఘర్షణ అనేది బొత్తిగా ఏమాత్రమూ లేనప్పుడు, అప్పుడు మనసుకు కలలు కనవలసిన అవసరం ఉండదు.

**ప్ర:** ఇది నిజంగా ఒక తలుపును తెరచినట్లుగా ఉన్నది. అందులో నుండి అనేక విషయాలను చూస్తున్నాను.

*('అర్జెన్సీ ఆఫ్ ఛేంజ్' నుండి 130–136 పుటలు)*

**మీ చిరునామా**
**మాకు వ్రాయండి.**
**'అంతరంగ యాత్ర'ను**
**ఉచితంగా పంపుతాము.**

*(1వ పేజీ తరువాయి) . . .*

## మనసు, 'నేను' ఒకటే వేరు వేరు కావు

ఉండాలి' అని అంటున్న మనసూ వేరు వేరు కావు. అవి రెండూ ఒక్కటే. మనసు తనను తాను ఇలా విభజించుకున్నది. అంతే. సరే, ఇది నేను చూశాను. ఇప్పుడు నేను ఏం చేయాలి? పరిసరాలు, ఈర్ష్య, అత్యాశ, నిబద్ధీకరణాల ఫలితంగా, వాటి చేత మనసు తయారు చేయబడింది. అటువంటప్పుడు అది చేయవలసినది ఏమిటి? తనను తాను నిబద్ధత నుండి విడిపించుకొని, స్వేచ్ఛ పొందడానికి మనసు చేసే ఏ కదలిక అయినా సరే అది స్వీయం చేస్తున్న క్రియే. తను ఇంకా సంతోషంగా ఉండటం కోసమూ, ఇంకా ప్రశాంతంగా ఉండటం కోసమూ, దేవుడి సన్నిధానంలో అతడి కనుసన్నల్లో ఉండటం కోసమూ స్వీయం చేపడుతున్న క్రియ ఇది. సరే, మనసు నడిచే పద్ధతీ, దాని కపటోపాయాలూ అన్నీ పూర్తిగా చూసి గ్రహించాను. అందుచేత మనసు ఇప్పుడు నెమ్మదిగా ఉన్నది. మనసు పూర్తిగా నిశ్చలంగా వుండిపోయింది. ఏ ఒక్క కదలికా లేదు. ఈ మౌన నిశ్శబ్దతలో, ఈ నిశ్చలనతలో స్వీయం నుండి విడుదల ఉంటుంది. మనసు నుండి విముక్తి ఉంటుంది. తనకు ఏదో లభించాలని కాని, దేనినో తప్పించుకోవాలని కాని మనసులో జరిగే కదలికల్లో స్వీయం పుట్టి ఊపిరిపోసుకుంటున్నది. ఏదో లభించాలని, దేనినో తప్పించుకోవాలని చేసే కదలిక ఏదీ లేనప్పుడు మనసు పూర్తిగా నెమ్మదిగా నిశ్చలంగా ఉంటుంది. అప్పుడు మాత్రమే సమష్టిచేతన, సమష్టికి వ్యతిరేకమైన చేతనలతో కూడిన ఆ సమస్త చేతన నుండి విడుదల పొందే అవకాశం ఉన్నది.

*('యాజ్ వన్ ఈజ్' నుండి)*

# మీరు విధ్వంసమై పోవడానికి, మీ దురవస్థకు మీరే బాధ్యులు

**ఒకరు ప్రశ్నిస్తున్నారు:**

నేను ప్రపంచాన్ని త్యజించాను. అంటే నా రచనా ప్రపంచాన్ని. రచనలే నా వృత్తి. అవన్నీ వదిలేశాను. ఎందుకూ అంటే ఇక మీదట ఆధ్యాత్మిక జీవనం గడపాలనుకుంటున్నాను. నాలో ఎన్నో రకాలైన ప్రతిభాసంపదలు ఉన్నా నా అభిరుచులు, అభిలాషలు, పేరూ ప్రఖ్యాతీ సంపాదించాలనే ఆకాంక్ష అన్నింటినీ పరిత్యజించి వేశాను. ఆ చరమసత్యమేదో కనుగొనాలనే అందుకోవాలనే ఆశతో మీ వద్దకు వచ్చాను. ఒక మహా వటవృక్షం ఛాయలో అయిదు సంవత్సరాలు గడిపాను. ఇప్పుడు హఠాత్తుగా నాలో నిరుత్సాహము, అలసట చోటుచేసు కున్నాయి. అంతర్గతంగా చూసుకుంటే చాలా ఒంటరిగా అనిపిస్తూవుంది. ఏకాకిలా పరమ దారుణమైన స్థితిలో వున్నాను.

ఉదయం లేవగానే చూసుకుంటే నేను గ్రహించినదేమీ లేదని, ఏదీ అందుకోలేదనీ అనిపిస్తున్నది. బహుశ ఒక రెండేళ్ళ క్రిందటే ఇంతకంటె బాగున్నానేమో. అప్పట్లో నాలో ఒక తీవ్రమైన మతాత్మకమైన ఆసక్తి బలంగా వుండేది. ఇప్పుడు నాలో ఏ ఉత్సాహమూ మిగిలి లేదు. దైవాన్వేషణ కోసం ప్రాపంచికమైన వాటిని త్యాగం చేశాను. ఇప్పుడు రెండూ లేవు. రసం పీల్చి పారేసిన కమలాఫలంలా వుంది నా స్థితి. దోషం ఎవరిది? బోధలదా, మీదా, మీ వాతావరణానిదా? లేదూ నాలోనే ఇందుకు తగిన శక్తి లోపించిందా? ఆ కారణంగా నీలాకాశాన్ని తెరచి చూపించే ఏ ఒక్క చిన్న పగులు నైనా గోడలో కనిపెట్టలేక పోయానా? లేదూ అసలు ఈ అన్వేషణే ఆది నుంచి అంతం వరకు కూడా వట్టి ఎండమావియా? ఈ మతం, ఆధ్యాత్మికతలవైపు రాకుండా, కంటికి కనబడే వాస్తవవిషయాలకే, నా పూర్వ జీవితపు అనునిత్య సుఖసంతోషాలకే కట్టుబడి పోయి వుండివుంటే బాగుండేదేమో! దోషం ఎక్కడుంది? ఇప్పుడు నేను చేయవలసినది ఏమిటి? ఇదంతా వదిలేయా లంటారా? వదిలేసి మరింకేం చేయాలి?

**కృష్ణమూర్తి:** ఈ వటవృక్షం కింద జీవించడం వలన, లేదూ ఏ వృక్షం ఛాయలో నైనా జీవించడం కారణంగా మీరు ధ్వంసమై పోతున్నారు అని మీకు అని పిస్తున్నదా? అవగాహనకు, సుస్పష్టంగా చూడటానికి అడ్డు తగులుతున్నది అదేనా? ఈ వాతావరణం మిమ్మల్ని హరించి వేసి నశింపజేస్తోందా? ఈ ప్రపంచాన్ని వదిలేసి తిరిగి మీరు మునుపు ఏం చేసేవారో అక్కడికి – మీ రచనా ప్రపంచమూ, మీ మామూలు నిత్యజీవితమూ లోకి – వెళ్ళారను కోండి. అప్పుడు మీరు ధ్వంసమైపోరా? మొరటుబారి పోరా? ఆ జీవితంలోని విషయాలు కూడా మిమ్మల్ని పీల్చి పిప్పిచేయకుండా ఉంటాయా? చూడండి, మనిషి ఎక్కడున్నా సరే,

(*4వ పేజీ తరువాయి*) . . .

# మీరు విధ్వంసమై పోవడానికి, మీ దురవస్థకు మీరే బాధ్యులు

ఏం పని చేస్తున్నాసరే, ఏ కారణం వెనక పెట్టుకొని శ్రమిస్తున్నా సరే, అతడు విజయసాధన కోసం ఆరాట పడుతుంటే కనుక ఈ వినాశ ప్రక్రియ మనిషిని ధ్వంసం చేస్తూనే వుంటుంది. ఇది వైద్యుల్లో చూడచ్చు, రాజకీయ వేత్తల్లో, శాస్త్రజ్ఞుల్లో, కళాకారుల్లో కూడా చూడచ్చు. ఏ ఒక్కరైనా ఎక్కడున్నా సరే ఈ వినాశాన్నుంచి తప్పించు కోగలరా?

**ప్రశ్నించినవారు:** నిజమే. ప్రతివారు నిస్సారులై నీరసించి పోతున్నారు. పేరు ప్రఖ్యాతు లుండవచ్చు, ఐశ్వర్యం ఉండచ్చు. నిష్పక్షపాత దృష్టితో తమను తాము పరికించుకుంటే ఎవరైనా సరే ఒప్పుకోకతప్పదు. వారిలో ఉన్నది పైకి ఎంతో ఆర్భాటంగా కనబడే కార్యకలాపాలు, మాటలు, సూత్రాలు, ఊహాసిద్ధాంతాలు, అభిప్రాయాలు, నీతి వాక్యాలు, ఆశలు, భయాలే తప్ప నిజానికి వారిలో ఇంకేమీ లేదూ అని. అడుగున ఉన్నది వట్టి ఖాళీ, గందరగోళము, పైబడిన వయసు, అపజయాల అక్కసు. అంతే.

**కృ:** ఈ ప్రపంచాన్ని వదిలేసి సన్యసించాము అని చెప్పుకునే ఆధ్యాత్మికులు నిజంగా చూస్తే ఇంకా అందులోనే ఉన్నారనే సంగతి మీరు గమనించారా? ఎందుకంటే ఇంకా అవే ఆకాంక్షలూ, కోరికలు నెరవేరాలని, సాఫల్యం చెందాలని, ఏదో అయిపోవాలని, జ్ఞానోదయం కావాలని, సాధించాలనీ, అన్నీ ఆకళించుకొని అట్టేపెట్టుకోవాలనీ ముందుకు తోస్తున్న అవే ఆరాటాలూ వారి ప్రవర్తనను నిర్దేశిస్తూ ఉంటాయి. అయితే ఈ ఆరాటాల వెనుక ఉన్న లక్ష్యాలను ఆధ్యాత్మికమైనవి అని వారు అంటారు. ఈ లక్ష్యాలు ప్రాపంచికమైనవి కావు, అవి భిన్నమైనవి అని కూడా అంటారు. అయితే ఈ రెండింటిలో బొత్తిగా ఏ తేడా లేదు.ఎందుకంటే ఏ ఆరాటమైనా సరే, అదంతా ఒకటే రకమైన కదలిక, చలనం. ఈ మతాత్మకులు కూడా సూత్రాలలో, ఆశయాలలో, ఊహాకల్పనల్లో, ఆశల్లో, అస్పష్ట అనుమాన భరిత నిర్ధారణలలో–ఇవి వట్టి నమ్మకాలు మాత్రమే–చిక్కుకొని పోయి ఉంటారు. వారు కూడా వృద్ధులవుతారు, వికృతంగా డొల్లగా తయారవుతారు. అందుచేత వారు వదిలి వచ్చిన ఆ ప్రపంచం కూడా పూర్తిగా నిస్సందేహంగా ఈ ప్రపంచం–ఆధ్యాత్మిక జీవనం అని పిలవ బదుతున్న ఈ ప్రపంచం వంటిదే. అదే ఇది, ఇదే అది. ఆ ఇంకొక ప్రపంచంలో మీరు ఎలా ధ్వంసమై పోతారో అదే విధంగా ఈ ఆధ్యాత్మిక ప్రపంచం అనబడే దానిలో కూడా నశించి పోతారు.

ఈ విధ్వంసము, ఈ హతమారిపోవడము మీరు ఉన్న పరిసరాల వలన, వాతావరణం కారణంగా జరుగుతున్నదా; లేక మీ లోపల నుండి జరుగుతున్నదా? ఇది మరొకరి నుండి వస్తున్నదా, మీలో నుండి వస్తున్నదా? ఎవరో మిమ్మల్ని నాశనం చేస్తున్నారా లేక మీకు మీరే ఇలా చేసుకుంటున్నారా?

**ప్ర:** ఈ హతమారి పోవడం, ఈ వినాశనం నా పరిసరాల ఫలితంగా జరుగుతున్నదని నేను అనుకున్నాను. అయితే అన్ని రకాల పరిసరాల్లోను, అన్ని చోట్లా ఇది జరుగుతుందని ఇప్పుడు మీరు సూచిస్తున్నారు. ఆ చోటు నుండి ఈ చోటుకు మారినా, తిరిగి ఈ చోటునుండి ఆ చోటుకు మారినా ఇది ఆగకుండా జరిగిపోతుందని అంటున్నారు. ఇది విన్నాక ఈ విధ్వంసం పరిసరాల ఫలితం కాదని నేను గ్రహించగలుగుతున్నాను. ఈ హతమారడం అనేది స్వయం వినాశనం. ఇది నాకు నేనే చేసుకుంటున్నాను. ఇది చేస్తున్నది నేను. దీని బాధ్యత నాదే. దీనిలో ఇతరుల సంబంధం కాని, పరిసరాల బాధ్యత కాని బొత్తిగా లేదు.

**కృ:** అదీ గ్రహించ వలసిన అత్యంత ప్రధానమైన సంగతి. ఈ విధ్వంసం మీ లోపల నుండి వస్తున్నది. మరెవ్వరి వద్ద నుండి కాదు. మీ పరిసర వాతావరణం వల్లా జరగడం లేదు. మనుష్యుల వలన కాదు. జరిగే సంఘటనల వలన కాదు. పరిస్థితుల వలన కాదు. మీ వినాశనానికి, మీ దారుణ అవస్థలకు, మీ ఏకాకితనానికి, మీ సొంత మానసిక ఎగుడు దిగుడులకు, మీ సొంత ఖాళీకి, డొల్లతనానికి మీరే బాధ్యులు. ఇది గ్రహించినప్పుడు మీరు దేనికీ స్పందించకుండా, చాలా కటువుగానో, చాలా మొరటుగానో అయిపోవచ్చు. పైపైకి అంతా బాగానే ఉంది అని నటించనైనా వచ్చు. లేదా అంటే మతిస్థిరత్వం కోల్పోయి, ఆ ప్రపంచానికీ ఈ ప్రపంచానికీ మధ్య ఊగిసలాడుతూ, రెండింటికీ కాస్తో కూస్తో తేడా ఉన్నదని అనుకుంటూ గడిపివేయనూ వచ్చు. లేదా అంటే మద్యాన్నో మాదకద్రవ్యాలనో ఆశ్రయించవచ్చు. అనేకమంది చేసేది ఆ పనే.

**ప్ర:** ఇప్పుడు నాకు అర్థమైంది.

**కృ:** అటువంటప్పుడు మీ జీవితంలో ఊరికే బాహిరమైన వాతావరణాన్ని మార్చడం ద్వారా, కేవలం ఈ నుండి తిరిగి ఆ కు మరలి పోవడం ద్వారా పరిష్కారం లభిస్తుందనే ఆశను పూర్తిగా త్యజించాలి. ఆ, ఈ లు సమానమే అనీ, ఒకటే అనీ మీరు తెలుసుకున్నారు కాబట్టి. రెండింటిలోను ఉన్నది ఒక్కటే – సాధించాలి, పరమసుఖాన్ని అందుకోవాలి, అది లభించాలి అనే కోరికే. ఈ పరమసుఖం కాంతిదర్శనమనీ, దైవం అనీ, సత్యమనీ, ప్రేమ అనీ మీరు పిలిచే దానిలో అవచ్చు, బ్యాంకులో పెద్దఖాతానో, ఏదో రకమైన భద్రతో కూడా కావచ్చు.

**ప్ర:** ఇది నేను గ్రహించాను. అయితే నేను చేయవలసినది ఏమిటి? నేను హరించుకొని పోతూ వున్నాను. నన్ను నేను నాశనం చేసుకుంటున్నాను. నేను నిర్వీర్యమై వట్టి పిప్పిగా మిగిలపోయాననీ శూన్యంగా, నిరుపయోగంగా పడివున్నాననీ అనిపిస్తున్నది. నాకు ఉన్నదంతా పోగొట్టుకున్నాను. బదులుగా ఏమీ లభించలేదు.

**కృ:** అయితే మీకు అవగాహన అవలేదని అనాలి. ఈ రకంగా మీకు అనిపిస్తుంటే, ఈ రకంగా మాట్లాడుతుంటే మనం అప్పుడు చెప్పుకున్న ఆ పాత దారిలోనే మీరు ఇంకా నడుస్తున్నారనమాట. ఆ లో కాని, ఈ లో కాని వున్న స్వీయ సఫలత అనే దారి. ఆ దారి స్వీయ హత్యా సదృశం. హతమారిపోవడానికి ఆ దారే కారణం. ఉన్నదంతా పోగొట్టుకున్నాను. దానికి బదులుగా మరేదీ లభించలేదు అని మీరు అనుకోవడం అంటే ఆ దారినే ఇంకా నడుస్తున్నారనమాట. ఆ దారే వినాశనం. అది చివరకు చేరే గమ్యమూ ఆ దారే. అంటే స్వీయవినాశనం, నిరాశ, నిస్పృహ, ఒంటరితనం, పరిణతి లేకపోవడం. అందుచేత ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే – మీరు నిజంగానే ఆ దారి వదిలేశారా?

**ప్ర:** ఆ దారి నేను వదిలేశానో లేదో నాకు ఎట్లా తెలుస్తుంది?

**కృ:** మీకు తెలియదు. కానీ ఆ దారి అంటే అసలు ఏమిటి, దాని ఆరంభం, అంతం ఏమిటి– నిజానికి దాని ఆరంభమే దాని అంతం కూడా– అనేవి కనుక మీరు గ్రహిస్తే అప్పుడిక మీరు ఆ దారిన నడవడం జరగనే జరగదు. అందులో ఉన్న ప్రమాదం తెలుసుకున్నాక, ఎప్పుడైనా పరధ్యాసలో పడిన క్షణాలలో ఆ మార్గం మీద పొరబాటున అడుగులు వేసినా వేయచ్చు. అయితే వెంటనే మిమ్మల్ని మీరే పట్టేసుకుంటారు. ఆ మార్గాన్ని చూడటము, ఆ శైథిల్యాన్ని చూడటము అంటేనే ఆ దారి సమాప్తమైపోవడం. ఇదే జరగవలసిన ఏకైక చర్య. 'నాకు అర్థమవడం లేదు, దీనిని గురించి నేను ఆలోచించాలి, దీని పైన పనిచేయాలి, నేను ఎరుకగా ఉండటం సాధన చేయాలి, నేను ధ్యానం చేయాలి, సావధానత అంటే ఏమిటో కనిపెట్టాలి, దీనిలోకి బాగా లోతుగా వెళ్ళాలి' అని ఏవేవో అనకండి. సాఫల్యం కోసం, సాధించడం కోసం, ఆధార పడటం కోసం జీవితంలో జరిపే ప్రతి ఒక్క కదలిక కూడా ఆ మార్గమే అని చూడండి. అలా గ్రహించడమే ఆ మార్గాన్ని పరిత్యజించడం. ఒక

☞6

(5వ పేజీ తరువాయి) . . .

## మీరు విధ్వంసమై పోవడానికి, మీ దురవస్థకు మీరే బాధ్యులు

ప్రమాదకరమైన విపత్తును చూసినప్పుడు దానిని గురించి ఏం చేయాలా అని మనసులో తర్జనభర్జన పడుతూ కూర్చోరు కదా. ఆపద ఎదురుగా నిలబడి వున్నప్పుడు 'నేను దీనిని గురించి ధ్యానిస్తాను, ఎరుకతో ఉంటాను, దాని లోపలగా వెళ్ళి విచారిస్తాను, అర్థంచేసుకుంటాను' అని అనరు గదా. మీరు దారి తప్పి ఎటో వెళ్ళిపోయారు. సమయం మించి పోయింది. అందుచేత మీరు చేయవలసినది ఏమిటంటే కేవలం ఆ దారిని చూసి, అది ఏమిటి, అది ఎక్కడికి తీసుకెళుతుంది, అది ఎటువంటి భావచలనం కలిగిస్తుంది అనేవి గ్రహించుకోవడం. ఇక ఈసరికే మీరు ఆ దారి మళ్ళీ మరో దిశగా నడచి పోతూ వుంటారు.

ఎరుక గురించి మేము చెప్తున్నప్పుడు దాని అర్థం ఇదీ. ఏమిటంటే: దారి గురించి, ఆ దారిలో వున్న లోతుపాతులను గురించి ఎరుక కలిగి ఉండండి. ఆ దారిలోనే వున్న, వివిధ రూపాలలో వున్న జీవితపు వేలాది కదలికలను గురించి ఎరుక కలిగి ఉండండి. 'మరొక దారి' ని చూడాలని కాని, దానిపై నడవాలని కాని ప్రయత్నిస్తే కనుక మీరు ఇంకా ఆ పాత దారి పైనే ఉన్నారనమాట.

**ప్ర:** నేను ఏం చేయాలో అది చూడగలుగుతున్నానో లేదో – ఆ సంగతి గట్టిగా నాకు ఎలా తెలుస్తుంది?

**కృ:** ఏం చేయాలో అది మీరు చూడలేరు. ఏమి చేయకూడదో అది మాత్రం చూడగలుగుతారు. ఆ పాత మార్గాన్ని సమస్తమూ కాదనడమే నవ్య ఆరంభం. ఇదే నవ్య మార్గం. ఈ కొత్త మార్గం పటాల్లో చిత్రీకరింపబడి లేదు. అసలు ఏ మ్యాపు లోనూ ఇది ఎప్పటికీ ఉండదు. ఈ మ్యాపులన్నీ కూడా తప్పు మార్గాన్ని, అంటే పాత మార్గాన్ని చిత్రపటంలో చూపుతాయి.

*('కన్వర్సేషన్స్' నుండి–13)*


# మన జీవితాలు

**జిడ్డు కృష్ణమూర్తి**

వ్యాఖ్యానాలు-3 విడుదలైంది

*అనువాదం:* **అబ్బూరి ఛాయాదేవి**

**వెల: రు.180/-**

**విశాలాంధ్ర వారి విక్రయశాలల్లో వసంతవిహార్, చెన్నైలో లభ్యమవుతుంది.**


## ఒంటరిగా, అస్పృశ్యంగా ఉన్న మనసు అమాయకంగా ఉంటుంది

ధ్యానం అంటే ఏమిటి అని గట్టిగా విచారణ చేస్తూ, ఈ ఆలోచనా ప్రక్రియను సమస్తమూ అర్థం చేసుకుంటే కనుక, అప్పడు మనసు పూర్తిగా నిశ్చలనంగా ఉండిపోతుందని కనిపెడతారు. ఆ సంపూర్ణమైన మానసిక నిశ్చలతలో గమనించేవాడు ఉండడు. పరిశీలకుడు ఉండడు. కాబట్టి అనుభవించే వాడు కూడా ఉండనే ఉండడు, అనుభవాన్ని సేకరించుకుంటున్న సత్వం ఏదీ ఉండదు. అదంతా స్వీయాన్ని కేంద్రంగా చేసుకున్న మనసు చేసే కార్యకలాపం. 'సమాధి అంటే ఇదే' అని అనకండి. అదంతా వట్టి బుద్ధిహీనత. ఎందుకంటే ఈ సమాధి వంటి వాటిని గురించి మీరు ఏదో పుస్తకంలో చదివి ఉంటారు. మీ అంతట మీరు స్వయంగా కనిపెట్టినది కాదు. మాటకి విషయానికి మధ్య అపారమైన అంతరం ఉన్నది. మాట అసలు విషయం కాదు. తలుపు అనే మాట తలుపు కాదు.

అందుచేత ధ్యానం అంటే మనసులో స్వీయకేంద్రిత కార్యకలాపాలు లేకుండా మనసును ప్రక్షాళించడం. ధ్యానంలో ఇంతవరకు కనుక మీరు వచ్చారంటే నిశ్శబ్దత, పూర్తిగా నిశ్శేషమైన శూన్యత ఉన్నదని కనిపెడతారు. మనసు ఇప్పడు సమాజం చేత కలుషితం అవడం లేదు. ఏ విధమైన భావాలకుకాని, ఏ కోరికల ఒత్తిడికి కాని ఇప్పడు మనసు గురి అవడం లేదు. మనసు పూర్తిగా ఒంటరిగా ఉన్నది. ఒంటరిగా ఉండటం వలన, అస్పృశ్యంగా ఉండటం వలన మనసు అమాయకంగా ఉంటుంది. అందుచేత, కాలరహితమైనది, శాశ్వతమైనది ఉనికిలోకి వచ్చే అవకాశం ఉన్నది.

ఈ సమస్త ప్రక్రియే ధ్యానం.

('దిబుక్ ఆఫ్ లైఫ్' నుండి.)


**Statement about ownership and other particulars of Antharanga Yatra**

**FORM-IV**

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar,<br>124, 126 Greenways Road<br>Chennai - 600 028. |
| 2. Periodicity of publication | : | Once in four months<br>(August, December & April) |
| 3. Printer's Name | : | N. Subramanian |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | Sudarsan Graphics Offset Press<br>27, Neelakanta Metha Street<br>T. Nagar<br>Chennai - 600 017. |
| 4. Publishers Name | : | G. Rajeev |
| Whether citizen of India | : | Yes |
| Address | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar<br>124,126 Greenways Road<br>Chennai - 600 028. |
| 5. Editors Name | : | K. Krishnamurthy |
| Address | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar<br>124, 126 Greenways Road<br>Chennai - 600 028 |
| 6. Name and address of the individuals who own the newspaper and partners of shareholders holding more than one percent of the total capital. | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar<br>124, 126 Greenways Road<br>Chennai - 600 028 |

I, G. Rajeev hereby declare that the particulars given are true to the best of my knowledge and belief.

Sd.
(G. Rajeev)

*Published in August, December & April*
*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*

Periodical

*If undeliverd please return to:*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803/24937596
E-mail: publications@kfionline.org
Websites: www.kfionline.org/www.jkrishnamurti.org

*Published by G. Rajeev on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65)Greenways Road, Chennai - 600 028.*
*Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*